క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 42వ డివిజన్ కోటమిట్ట ప్రాంతంలో మహ్మద్‌సత్తార్ నివాసం గత శనివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. దీనిని బాధిత కుటుంబానికి పార్టీ డివిజన్ ఇన్‌చార్జి ఇర్ఫాన్ చేతులమీదుగా సోమవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజయ్ కుమార్, సుధీర్ పాల్గొన్నారు.

బైక్ చోరీకి యత్నం



బైక్‌ను చోరీ చేసేందుకు యత్నించిన వ్యక్తి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను పట్టపగలు ఓ వ్యక్తి చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన పయ్యాం అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం తన ఇంటి ముందు బైక్‌ను నిలిపి ఇంట్లో ఉన్న సమయంలో ఇనమడుగు సెంటర్‌కు చెందిన రఫీ అనే వ్యక్తి బైక్‌ను చోరీ చేసేందుకు యత్నించారు. వెంటనే స్థానికులు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు.

కిశోరి వికాసం పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరురూరల్ : కిశోరి వికాసం పోస్టర్లను కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన శిక్షణా కార్యక్రమాల షెడ్యూల్ వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ షాన్‌వాజ్ పాల్గొన్నారు.

జువేరియాకు అభినందన



నెల్లూరు రూరల్ : పదో తరగతి ఫలితాల్లో నెల్లూరు నవలాకుల గార్డెన్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మహమ్మద్ జువేరియా 594 మార్కులతో సత్తా చాటింది. దీంతో ఆమెను కలెక్టర్ ఆనంద్ తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలువడం పట్ల తండ్రి మొహమ్మద్ అబ్దుల్ అజీజ్, తల్లి ఖాజాజమీర్‌కు అభినందనలు తెలిపారు.

సీఎంను కలిసిన శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఉండవల్లిలో సీఎం చంద్రబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు. ఈనెల 15న పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను కూడా కలిసి వివరించారు.

కార్పొరేషన్ ఉద్యోగులకు సిమ్‌లు కట్

- పొదుపు పేరుతో చర్యలు

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు కార్పొరేషన్‌కు రూ.లక్షలు తూట్లు పడుతున్నా అధికారులు రూ.వేలల్లో పొదుపు చేస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. దొడ్డిదారిన ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకోని వారు అధికారులు వినియోగిస్తున్న సిమ్‌లు కార్పొరేషన్‌కు కష్టమయ్యాయి.

నెలకు రూ.70 వేల పొదుపు

కార్పొరేషన్‌లోని అధికారులు, సిబ్బందికి మొత్తం దాదాపు 142 సిమ్‌లను అప్పట్లో ఇచ్చారు. ఆయా సిమ్‌ల వాడకానికి నెలకు దాదాపు రూ.90 వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇందులో 34 మంది ముఖ్యమైన అధికారులు, సిబ్బందికి మాత్రం సదరు సిమ్‌లను ఉంచి మిగిలిన వాటిని అందజేయాలని ఆదేశించారు. ఇందులో 16 ఎయిర్‌టెల్ సిమ్‌లుండగా ఒక్కో సిమ్‌కు నెలకు రూ.399 చొప్పున మొత్తం రూ.6,384 కాగా వోడాఫోన్-ఐడీయా సిమ్‌లు మొత్తం 108 ఉండగా వీటికి ఒక్కో సిమ్‌కు నెలకు రూ.588.82 చొప్పున మొత్తం రూ.63,592 లెక్కన మొత్తం రూ.69,976 అవుతున్న ఖర్చు ఇక నుంచి కార్పొరేషన్‌కు మిగలనుంది. ఈ మేరకు కమిషనర్ నందన్ సిమ్‌లను తిరిగి ఆయా సంస్థలకు అప్పగించాలని, అదే విధంగా సిమ్‌లకు సంబంధించి కనెక్షన్లను బ్లాక్(రద్దు) చేయాలని ఆయా సంస్థల యాజమాన్యానికి శనివారం లేఖకూడా రాశారు.

ప్రక్షాళన లేక.. పాలన సాగక

- గాడితప్పిన ఎస్ఎంసీ సేవలు
- కమిషనర్లు మారినా లేని మార్పు
- సమయపాలన పాటించని సిబ్బంది
- విభాగాల పర్యవేక్షణ కరువు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ)లో పరిపాలన పరంగా అనేక సమస్యలు నెలకొన్నాయి. ఇక్కడ కొందరు అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎవరి ఇష్టానుసారంగా వారు వ్యవహరిస్తున్నారు. కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. పలు విభాగాల్లో అవినీతి, అక్రమాలు మితిమీరిపోయాయి. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిపాలనను సక్రమంగా నడిపేందుకు ప్రక్షాళన చేయాల్సి ఉంది.



నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు) : పది నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సూర్యతేజ పరిపాలనను ప్రక్షాళన చేసి అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసి సమస్యలకు ఫుల్‌స్టాప్ పెడతారని వేచి చూస్తున్నప్పటికీ పెద్దగా మార్పు కనిపించలేదు. పైగా తనకంటూ ప్రత్యేక మార్క్ వేసుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా పలువురు అధికారులు, సిబ్బందిని అంతర్గత బదిలీలు చేపట్టారు. అంతేకాకుండా సదరు కమిషనర్ ఐఏఎస్ అయిఉండి కూడా అత్యంత కింది స్థాయి ఉద్యోగులను సీసీలుగా తన వద్ద ఉంచుకుని వారి మాయమాటలు నమ్మి పలు అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలతో పాటు మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యేలను సమన్వయం చేయడంలో విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ అధికారి ఏడాది కాకుండానే బదిలీ కావాల్సి వచ్చింది.

నగర పరిధిలో..

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉండగా 167 సచివాలయాలున్నాయి. దాదాపు తొమ్మిది లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. నగర ప్రజలకు కార్పొరేషన్ ద్వారా మౌలిక వసతులు, పౌరసేవలు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరపాలక సంస్థ ద్వారా చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ నగరాన్ని సుందరీకరణంగా తీర్చిదిద్దేలా కమిషనర్ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే గాడితప్పిన పరిపాలనతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొనడంతో పాటు అవినీతి, అక్రమాలకు ఎన్ఎంసీ నిలయంగా మారింది.

వేలాది మంది ఉద్యోగులు

నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఆరోగ్య, రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్ తదితర విభాగాలున్నాయి. వాటిలో వేలాది మంది ఉద్యోగులు ఉన్నారు. వారంతా అర్హతను బట్టి విధులు నిర్వర్తించాలని ఉద్యోగ బాధ్యతలు అప్పగిస్తూ నియమించడం జరిగింది. అయితే ఆయా విభాగాల్లో కొందరు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారు.

అవసరానికి మించిన సిబ్బంది

నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి విభాగంలో ఉండాల్సిన సిబ్బంది కంటే అధికంగా ఉన్నారు. ఎందుకు ఉన్నారో, ఏం చేస్తున్నారో తెలీదు. అడిగే వారు లేరన్న ధీమాతో వారి ఇష్టంగా వస్తూ పోతూ నెలనెలా జీతాలు తీసుకుంటున్నారు. అయితే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు నిత్యం పదుల సంఖ్యలో ఎన్ఎంసీ కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి సమాధానం చెప్పేవారు ఉండరు. ఒకవేళ ఉన్నా వారికి ముడుపులు ముట్టజెబితేనే సమాధానం చెప్పడం, పనిచేయడం జరుగుతోంది. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇస్తే సంబంధిత అధికారులు స్పందించడం మినహా మిగతా సమయాల్లో కాలక్షేపం చేస్తుంటారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సమీక్షలు ఏవీ?

ఎన్ఎంసీలో ఉద్యోగులు సయమపాలన పాటిస్తున్నారా.. ఏవిధంగా విధులు నిర్వర్తిస్తున్నారు? ఇలా వారంలో ఒకరోజైనా ఆయా విభాగాధికారులు పర్యవేక్షించి పూర్తి స్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. అలాగే ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో విధిగా సమీక్షలు నిర్వహించి వారి పనితీరును తెలుసుకుంటున్న పరిస్థితి కూడా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తామేమి చేసినా అడిగే వారు లేరన్నట్టుగా ఆయా విభాగాధిపతులు, కింది స్థాయి ఉద్యోగులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రక్షాళన చేసి పరిష్కరించేనా..

రాష్ట్ర పురపాలక, పట్టణ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో పాటు కొద్ది రోజుల క్రితం నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టిన వైఓ నందన్ ఇకనైనా గాడితప్పిన ఎన్ఎంసీ పరిపాలనపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్షాలన చేసి సమస్యలను పరిష్కరించాల్సి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనా నగరపాలక సంస్థ పరిపాలనలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పరిపాలన సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా దృష్టి సారించి అడుగులు వేయాలని, లేనిపక్షంలో ఎన్ఎంసీ పరిస్థితి మరింత అధ్వానంగా తయారయ్యే అవకాశాలున్నాయని నగర ప్రజలు అంటున్నారు.

రేపట్నుంచి కాశీవిశ్వనాథుని బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని నిర్వాహకులు సోమవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తున్నామన్నారు. గురువారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి శేషవాహనసేవ, శుక్రవారం రాత్రి చంద్రప్రభ, శనివారం రాత్రి రావణసేవ, ఆదివారం ఉదయం గిన్నెభిక్ష, రాత్రి నందిసేవ, సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, మంగళవారం ఉదయం రథోత్సవం, బుధవారం ఉదయం తీర్థవాది, రాత్రి ధ్వజావరోహణ, గజవాహనసేవ తదితరాలు ఉంటాయన్నారు.

అధికారుల పర్యవేక్షణలో నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేత

నెల్లూరు రూరల్ : సోమశిల అదనపు హెడ్ రెగ్యులేటర్‌ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణలో నిర్మించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సోమశిల ప్రాజెక్ట్ పర్యవేక్షణాధికారి వెంకటరమణకు ఆయన కార్యాలయంలో సోమవారం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాట్లూరు శ్రీనివాసులు, నరాల సుబ్బారెడ్డి, రఘురామయ్య, రత్నంనాయుడు, నాగలక్ష్మి, పద్మావతి, శిరీష, నారాయణ, ఏవీ సుబ్బయ్య, కళ్లు భాస్కర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

- డిప్యూటీ కమిషనర్ చెన్నుడు



అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ చెన్నుడు

నెల్లూరు(బారకాసు) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయన సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌తో పాటు ఇతర విభాగాల అధికారులకు అందించి పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు.

54 వినతుల స్వీకరణ

వివిధ సమస్యలపై మొత్తం 54 వినతులను స్వీకరించినట్లు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు వెల్లడించారు. వాటిలో అడ్మినిస్ట్రేషన్ 4, ఇంజినీరింగ్ 8, హౌసింగ్ 22, రెవెన్యూ 4, పబ్లిక్‌హెల్త్ 2, టౌన్‌ప్లానింగ్ 13, పెన్షన్ 1 చొప్పున ఉన్నాయన్నారు. స్థానిక సమస్యలను సీసీసీ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటిని నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ శేషగిరిరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, సిటీప్లానర్ పద్మజతో పాటు పలు విభాగాలకు చెందిన సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే

నెల్లూరు(బారకాసు) : నుడా పరిధిలో ఉన్న లేఅవుట్లలో పట్టణ ప్రణాళికాధికారుల ద్వారా నిర్వహిస్తున్న సర్వే పకడ్బందీగా చేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక నుడా కార్యాలయంలో అధికారులతో సోమవారం ప్రత్యేకంగా చర్చించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మంత్రి నారాయణ ఆదేశాల మేరకు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సర్వే వల్ల యజమానులు, ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు పడకుండా.. నష్టం వాటిల్లకుండా ఉండేందుకు మాత్రమే అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్) : వేదాయపాళెంలోని జ్యోతి నగర్ ఐదో వీధికి చెందిన పటాన్ మునాఫ్ (35) ఆదివారం సాయంత్రం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మృతిచెందారు. చిరంజీవి ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సూచనతో కుటుంబ సభ్యుడు పటాన్ ఇమ్రాన్ మృతిచెందిన మునాఫ్ నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేసేందుకు అంగీకరించాడు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. మరణించిన వారి నేత్రాలను దానం చేసేందుకు 99595 89321, 98666 16565 నంబర్లకు ఫోన్ చేయాలని సునీల్ కోరారు.

నేటి నుంచి వేదగిరి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని నరసింహకొండలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 6న అంకురార్పణ, 7న చప్పరోత్సవం, ధ్వజారోహణ, రాత్రి శేష వాహన సేవ, ఇలా 16వ తేదీన వరకు వివిధ పూజలు, అభిషేకాలు, అలంకారాలు ఉంటాయి.

వీరబ్రహ్మేంద్రుని ఆరాధన మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం) : విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బుధవారం ఆరాధన మహోత్సవం జరుగనుందని పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపక శాశ్వత అధ్యక్షుడు కందుకూరు చంగయ్య ఆచారి సోమవారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

పరామర్శ



నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు దావులూరి లోకేశ్‌ను పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. దావులూరి లోకేశ్‌తో పాటు ఆయన తండ్రి గురునాథం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారు. ఈ క్రమంలో పడారుపల్లి సుందరయ్య కాలనీలోని వారి నివాసానికి ఆనం విజయకుమార్‌రెడ్డి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, 23వ డివిజన్ ఇన్‌చార్జి యనమల మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు తల్పరెడ్డి సుధీర్‌రెడ్డి, గంగవరపు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- డీఎంఓ హుస్సేనమ్మ



మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్) : డెంగీ, చికెన్ గున్యా, మలేరియా లాంటి సీజనల్ వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్లతో హుస్సేనమ్మ సోమవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో మలాథియాన్ స్ప్రే చేయాలని ఆదేశించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూడటం ద్వారా వ్యాధులను నియంత్రించాలన్నారు. జిల్లాలోని శాశ్వత నీటి గుంతలను గుర్తించి వాటిల్లో దోమలు పెరగకుండా గంబూషియా చేపలను విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేసి దోమలను నివారించేలా వార్డెన్లతో మాట్లాడి చర్యలు చేపట్టాలన్నారు. సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడు ఈనెల ఒకటో తేదీన సంతపేట నాలుగుకాళ్ల మండపం వద్ద స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు 108 సాయంతో వృద్ధుడిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈఘటనపై సంతపేట ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

హరిహరమూర్తిగా మూలస్థానేశ్వరుడు



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు హరిహర మూర్తి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా పలగంటి వెంకటసుబ్బారావు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

ప్రమోషన్లలో ఎస్సీ వర్గీకరణకు వినతి



నెల్లూరు(అర్బన్) : వైద్యశాలల్లో హెడ్ నర్సుల ప్రమోషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి మాదిగలు, ఉపకులాలకు న్యాయం చేయాలని మహాజన టీచర్స్ అసోసియేషన్(ఎంటీఏ) సభ్యులు కోరారు. ఈ మేరకు నెల్లూరుకు చెందిన చేమూరు మస్తాన్‌మాదిగ విజయవాడలోని వైద్యశాఖ డైరెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందచేశారు.

బహుమతుల ప్రదానం



నెల్లూరు(బృందావనం) : నృత్య, పాటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను వేదాయపాళెం నిప్పోసెంటర్ సాయిబాబా మందిరం వద్ద ఉన్న శాస్త్రీయ నృత్య శిబిరంలో సోమవారం అందజేశారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు వీటిని అందించారు. కార్యక్రమంలో నృత్య గురువు ఎస్.రమణయ్య, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, శిక్షకులు ప్రవీణ్, వంశీ, కల్యాణ్, శీనయ్య, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఆర్మీ సిబ్బంది



నెల్లూరు సిటీ : నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో గూడూరు నుంచి కావలి వైపు మార్గంలో సోమవారం ఓ రైలు ఆగింది. ఇందులో వందల మంది ఆర్మీ సిబ్బంది ఉండడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వారిని వీడియో తీసేందుకు ప్రయత్నించగా ఇప్పుడున్న పరిస్థితిల్లో వీడియోలు తీయవద్దని ఆర్మీ సిబ్బంది చెప్పారు.

త్వరలో అనిల్ అరెస్ట్ : బీద

నెల్లూరు సిటీ : కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై విచారణ పూర్తయి అరెస్ట్ వరకు వచ్చారని, అతిత్వరలో అనిల్ కూడా అరెస్ట్ కాబోతున్నారని టీడీపీ నేత, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనింగ్‌కు సంబంధించి ఇరిగేషన్ అక్రమాలపై విచారణ తుది దశకు చేరుకుందన్నారు. అనిల్‌పై కూడా చర్యలు తీసుకోబోతున్నారన్నారు.

అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం) : స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో సోమవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దేసు విజయకుమార్- కల్పన దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. రాత్రి అమ్మవారి నగరోత్సవం వేడుకగా సాగింది. దేవస్థానం పాలకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, చైర్మన్ కోట గురుబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, గౌరవ సలహాదారు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, కోశాధికారి ఉమ్మెన జనార్దన్, సహాయ కార్యదర్శి మునగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు టిడ్కో గృహాలు



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : స్థానిక 5, 52 డివిజన్లలో పాత చెక్‌పోస్టు, బర్మాషెల్ గుంట, రైల్వేకట్ట వీధి ప్రాంతాల్లోని రైల్వే స్థలాల నిర్వాసితులకు టిడ్కో గృహాల్లో తాత్కాలిక వసతిని కల్పించి, వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయం కల్పించనున్నామని కమిషనర్ నందన్ తెలియజేశారు. ఆయా ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి నిర్వాసిత ప్రజలతో మాట్లాడారు. వారికి తప్పనిసరిగా ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రైల్వే స్థలం నిర్వాసితులు మొత్తం 150 కుటుంబాలకు అల్లీపురం, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లోని టిడ్కో గృహాలను తాత్కాలికంగా కేటాయించనున్నామని తెలిపారు. ఐదో డివిజన్ కార్పొరేటర్ రవిచంద్ర, అర్బన్ తహసీల్దార్ షఫీ మాలిక్, కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సిటీ ప్లానర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రప్రసాద్‌కు నివాళి



నెల్లూరు(బృందావనం) : పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్‌కు పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో సోమవారం అంజలి ఘటించారు. తొలుత రామచంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. శ్రీహరి తీర్థస్వామి, విశ్రాంత ప్రిన్సిపల్ సూరం శ్రీనివాసులు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, నలబోలు బలరామయ్యనాయుడు, బత్తిన సాయికుమార్‌రెడ్డి, పోలవరపు లక్ష్మీనరసింహారావు, కోట శ్రీరామమూర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.